సాక్షి ప్రకాశం

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



కార్యకర్తలకు అండగా.. జగనన్నకు తోడుగా

కార్యకర్తలే పార్టీకి బలం అని, వారికి అండగా నిలిచి జగనన్నకు తోడుగా నిలబడదామని మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు.

- 8లో..



ఇంజెక్షన్ వికటించి గర్భిణి మృతి

ఇంజెక్షన్ వికటించి ఎనిమిది నెలల గర్భిణీ మృతిచెందిన ఘటన అర్ధవీడులో బుధవారం జరిగింది.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 34/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆర్‌ఎంపీలు పరిమితి మీరితే చర్యలు

- డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు



గ్రామీణ వైద్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు అర్బన్: ఆర్‌ఎంపీ (గ్రామీణ వైద్యులు) పరిమితులకు లోబడి ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, పరిమితులు మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం రెడ్‌క్రాస్ భవనంలో ఔషధ నియంత్రణ అధికారి జ్యోతితో కలిసి ఆర్‌ఎంపీలతో సమావేశం నిర్వహించారు. దీనిలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు చికిత్స కేంద్రం వద్ద డాక్టర్ అని పేరును వినియోగించకూడదన్నారు. ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలని, అందుకు సరిపడా మందులు మాత్రమే చికిత్స కేంద్రంలో ఉండాలన్నారు. అంతకుమించి ఔషధాలు ఉండకూడదని తెలిపారు. అనుమతులు లేని ఔషధాలు గుర్తిస్తే వారికి లక్ష రూపాయల జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. సంక్రమణ వ్యాధులు గుర్తిస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలపాలన్నారు.

మొబైల్ యాప్‌తో చిన్న తరహా నీటి వనరుల గణన

- ముఖ్య ప్రణాళికా అధికారి వెంకటేశ్వర్లు




సమావేశం నిర్వహిస్తున్న సీపీఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు అర్బన్: జిల్లాలో 7వ చిన్న తరహా నీటి వనరుల గణన 2023–24 ప్రామాణికంగా గ్రామ స్థాయి నుంచి మొబైల్ యాప్ ద్వారా చేయాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి (సీపీఓ), జిల్లా స్థాయి కమిటీ కన్వీనర్ డీ వెంకటేశ్వర్లు సూచించారు. ప్రకాశం భవనంలో బుధవారం సీపీఓ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో సీపీఓ మాట్లాడుతూ 2017–18 సంవత్సరం ప్రామాణికంగా చేపట్టిన గణనలో 93,600 చిన్న తరహా నీటి వనరులు గణన చేశారని, ఇప్పుడు అవి లక్షకు పైగా ఉండే అవకాశం ఉందన్నారు. నీటివనరుల యాప్ నమోదు కోసం మండలాల వారీగా తహశీల్దార్ కార్యాలయాల్లో గ్రామ ఎన్యుమరేటర్‌లు గ్రామాధికారులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర అర్థ గణాంక శాఖ కార్యాలయం నుంచి వచ్చిన సహాయ సంచాలకులు రమేష్‌బాబు, ఉప గణాంక అధికారి జీ రమేష్ మొబైల్ యాప్‌లో ఏ విధంగా గణ చేపట్టాలనే అంశాన్ని వివరించారు. గ్రామాల వారీగా 2 వేల హెక్టార్లలోపు సాగు విస్తీర్ణం ఉన్న అన్నీ రకాల చెరువులు, ఎత్తిపోతల పథకాలు, వ్యవసాయ బోర్లు, బావులు అన్నీ యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనిలో జిల్లా స్థాయి కమిటీ సభ్యులు గ్రౌండ్ వాటర్ డీడీ విద్యాసాగర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, డీటీడబ్ల్యూ, డ్వామా అధికారి ఝూన్సీ, పంచాయతీరాజ్ డీఈఈలు, ఇరిగేషన్ డీఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- ఏపీజేఏసీ జిల్లా శాఖ చైర్మన్ పిన్నిక మధుసూదనరావు



మాట్లాడుతున్న ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదనరావు

ఒంగోలు అర్బన్: జిల్లాలోని చిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీజేఏసీ జిల్లా శాఖ చైర్మన్ పిన్నిక మధుసూదనరావు రాష్ట్ర నాయకులను కోరారు. విజయవాడలో బుధవారం ఏపీజేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా చైర్మన్‌తో పాటు మహిళా విభాగం జిల్లా శాఖ చైర్మన్ జయలక్ష్మి, జనరల్ సెక్రటరీలు సీహెచ్ శ్రీదేవి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా చైర్మన్ జిల్లాకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, వీఆర్ఏలకు జీతాలు పెంచాలని, జూనియర్ అసిస్టెంట్‌లు, వీఆర్‌ఓలు పదోన్నతిపై సీనియర్ అసిస్టెంట్లు అయిన వారికి సర్వే మెయింటెనెన్స్ పరీక్ష నిర్వహించాలని, అందుకు రాష్ట్ర శాఖ చొరవ చూపాలని కోరారు.

తంబీలు.. తీరంలో పేట్రేగి..



పాకల తీరానికి దగ్గరలో చేపల వేట సాగిస్తున్న సోనాబోట్లు

తీరంలో తమిళ జాలర్లు పేట్రేగిపోతున్నారు. నిన్న మొన్నటి వరకూ తీరానికి ఆరు, ఏడు కిలోమీటర్ల దూరానికి వచ్చి మత్స్య సంపదను దోచుకుపోవడమే కాకుండా భౌతిక దాడులకు దిగేవారు. విలువైన వలలను ధ్వంసం చేసేవారు. తాజాగా వారు తీరానికి దూసుకు వస్తున్నారు. ఇటీవల కొన్ని తమిళనాడు బోట్లు తీరంవైపు దూసుకొచ్చాయి. ఈ ఇది స్థానిక మత్స్యకారులను కలవరపాటుకు గురిచేసింది.

- మితిమీరిన తమిళ సోనాబోట్ల ఆగడాలు
- నిబంధనలు గాలికొదిలి తీరం సమీపానికి
- వలలు ధ్వంసం చేసి.. మత్స్య సంపదను దోచేసి
- ఆర్థికంగా చితికిపోతున్న గంగపుత్రులు
- సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి మత్స్యకారుల విజ్ఞప్తి

సింగరాయకొండ: తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన సోనాబోట్లలో మత్స్యకారులు నిబంధనలను అతిక్రమించి చేపల వేట సాగిస్తున్నారు. సముద్ర తీరప్రాంత నిబంధనల ప్రకారం మోటారు లేని బోట్లు తీరానికి 2 కిలోమీటర్లు, మెకనైజ్డ్ బోట్లు తీరానికి 8 కిలోమీటర్లు, సోనాబోట్లు తీరానికి 8 కిలోమీటర్ల పైన మాత్రమే చేపల వేట సాగించాల్సి ఉంది. నిబంధనలు అతిక్రమించిన వారిపై సముద్ర తీర ప్రాంత నింబధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. దశాబ్దాల కాలంగా కడలూరుకు చెందిన మత్స్యకారులు మన తీరానికి వచ్చి విలువైన మత్స్య సంపదను దోచుకుపోతున్నారు. పలు సందర్భాల్లో స్థానికంగా ఉండే మత్స్యకారులపై దాడులకు తెగబడడం, లక్షలు విలువజేసే వలలు ధ్వంసం చేయడం జరుగుతూనే ఉంది. గతంలో రోజుకు 10 వరకు సోనాబోట్లు తీరానికి దగ్గరలో వేటాడుతుంటే నేడు సుమారు 50కి పైగా రాత్రి, పగలు తేడాలేకుండా వేటాడుతున్నాయని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మత్స్య సంపద లభించకపోవడంతోపాటు విలువైన వలలు ధ్వంసం కావడంతో అప్పులు పాలవుతున్నామని, ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే ఈ సీజన్‌లో సముద్రతీరంలో ఎక్కువగా కాణాగంతలు, కిలాయి, యర్రచేప, తమ్మారెడ్డి చేప, నగర, ఓడ, కుడాయి, పండుగప్ప, వంజరం చేపలు లభ్యమవుతాయి. కుడాయి, పండుగప్ప రకం చేపలు ఎక్కువ బరువు ఉంటాయి. ఇవి తీరానికి అత్యంత సమీపంలో ఉంటాయి. వీటి కోసం రెండు వారాల కిందట తమిళ జాలర్లు తీరానికి రెండు కిలోమీటర్ల సమీపానికి జొరబడ్డారు. చేపలను పట్టుకుపోవడమే కాకుండా పెద్ద వలలను ధ్వంసం చేసి వెళ్లి పోయారు. దీనిపై స్థానికంగా ఆందోళన చెందుతున్నారు.



సోనాబోట్ల దాడులతో ధ్వంసమై తీరానికి కొట్టుకొచ్చిన వలలు

కేసు నమోదు చేశారు కానీ..

సుమారు 4 నెలల క్రితం కొత్తపట్నం తీరానికి దగ్గరలో వేటాడుతున్న సోనాబోటుపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు అధికారులు కేసు నమోదు చేశారు. కేసు వివరాలను రాష్ట్ర మత్స్యశాఖ కార్యదర్శికి కూడా పంపించారు. అయితే ఇంత వరకు ఆ సోనాబోటుపై ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో సోనాబోట్ల చొరబాట్ల దాడుల విషయంపై ప్రభుత్వం చర్చించి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. అలాగే సమస్యను సీఎం దృష్టికి సైతం తీసుకెళ్లారు. సోనాబోట్ల బెడద తప్పుతుందని మత్స్యకారులు సంబరపడ్డారు. అది మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలి పోయింది. గతంతో పోలిస్తే ఇప్పుడు బోట్ల సంఖ్య భారీగా పెరిగిందని స్థానికులు వాపోతున్నారు.

సోనాబోట్ల కారణంగా జిల్లాకు చెందిన మత్స్యకారుల వలలు ధ్వంసం అయి లక్షలాది రూపాయలు నష్టపోగా, భారీ ఎత్తున మత్స్య సంపద కూడా తుడిచిపెట్టుకుపోయి ఆర్థికంగా నష్టపోతున్నామని, దీనికి తోడు వేట నిషేధ భత్యం కింద మత్స్యకార భరోసా కూడా ఇవ్వకపోవటంతో మా బతుకులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారుల ఇబ్బందులు తీర్చేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండు సార్లు ఇరు రాష్ట్రాల మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేసినప్పటికీ కరోనా కారణంగా ఆ ప్రయత్నాలు ఫలించలేదు. తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రైవేటు బోటును అద్దె పద్ధతిలో తీసుకుని తమిళ జాలర్ల ఆగడాలకు చెక్ పెట్టే ప్రయత్నం చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టికి సోనాబోట్ల సమస్యను తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని, తమను ఈ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని స్థానిక జాలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంత దూరమైనా వేటాడాల్సిందే..

కడలూరు బీచ్ నుంచి రాష్ట్రంలోని కొత్తపట్నం బీచ్ వరకు సుమారు 150 ఏరోనాటికల్ మైళ్ల దూరం ఉంది. ఈ మార్గంలో ప్రధానంగా తిరుపతి జిల్లాలోని వాకాడు ప్రాంతంలో గోవిందరావు పట్టపుపాలెం, నెల్లూరు జిల్లా కావలి మండలం ఇస్కపల్లి పట్టపుపాలెం, రామాయపట్నం, చాకిచర్ల పట్టపుపాలెం, జిల్లాలోని ఊళ్లపాలెం, పాకల పట్టపుపాలెంలు, టంగుటూరు మండలం తాళ్లపాలెం, కొత్తపట్నం బీచ్, మడనూరు ప్రాంతాల్లో మత్స్యకార పాలెంలు ఉన్నాయి. వందల మైళ్ల దూరం దాటి సోనాబోట్లు తీరప్రాంత చట్టాలను ఉల్లంఘించి తీరంలో వేటాడుతున్నా వాటిని అడ్డుకోవటానికి సరైన చట్టాలు లేకపోవటం వారికి వరంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. ఇదే తంతు కొనసాగితే ఆత్మహత్యలు తప్ప గత్యంతరం లేదని గంగపుత్రులు వాపోతున్నారు.

రెండు వలలు నష్టపోయా



సోనాబోట్ల కారణంగా వేలాది రూపాయల వలలు నష్టపోయాను. గత నెల 24వ తేదీ మధ్యాహ్న సమయంలో సముద్రంలో వలవేస్తే తెంచారు. దీంతో రూ.15 వేల పులసల వల నష్టపోయాను. తిరిగి ఈనెల 4వ తేదీ రూ.10 వేల విలువైన పులసల వల తెంచేశారు. నా వద్ద వల కొనుక్కునే డబ్బు లేదు. డబ్బు కూడబెట్టే వరకు వేరే బోటులో కూలీగా వెళ్లాల్సిందే. మత్స్యకార భరోసా ఇస్తే కొంతవరకు మాకు ఇబ్బందులు తీరతాయి. కానీ ఎప్పుడు ఇస్తారో అర్థం కావటం లేదు.

– కన్నా సుబ్బారావు, మత్స్యకారుడు, ఊళ్లపాలెం

ఎట్లా బతకాలో ఏమో..



సముద్రంలో 10 రోజుల క్రితం చేపల కోసం వల వేస్తే సోనాబోట్లు తెంచేయటంతో సుమారు రూ.25 వేల వల నష్టపోయాను. మళ్లీ వల కొనుక్కోవాలంటే 3 రూపాయల వడ్డీకి అప్పు చేయాల్సిందే. ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడో, ఎట్లా బతకాలో అర్థం కావటం లేదు.

– తంబు నాగరాజు, మత్స్యకారుడు, ఊళ్లపాలెం

అంతా ఏకపక్షం..!



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి)

- ప్రజా సమస్యలపై మాట్లాడనీయకుండా గొంతునొక్కే యత్నం
- రసాభాసగా ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం
- వైఎస్సార్ సీపీ, టీడీపీ సభ్యుల నడుమ గందరగోళం
- మేయర్ పోడియంను ముట్టడించిన వైఎస్సార్ సీపీ సభ్యులు
- టీడీపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ ధ్వజం
- కూరగాయల మార్కెట్ విషయంలో చిరు వ్యాపారుల కడుపు కొడుతున్నారని మండిపాటు
- వైఎస్సార్ సీపీ సభ్యులు ధ్వజమెత్తడంతో షాదీఖానా లీజు విషయంలో వెనక్కు తగ్గిన వైనం
- ఖబరస్థాన్ స్థల రద్దు అంశం వాయిదా
- టీడీపీ ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ సభ్యులు కౌన్సిల్ నుంచి వాకౌట్



సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి బయటకు వస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఏకపక్షంగా సాగింది. ప్రజా సమస్యలపై చర్చించకుండా టీడీపీ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ, టీడీపీ కూటమి సభ్యుల వాదప్రతివాదనల మధ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా సభ్యుల గొంతునొక్కడంపై వైఎస్సార్ సీపీ సభ్యులు ధ్వజమెత్తారు. దాంతో కౌన్సిల్ సమావేశంలో కొంత గందరగోళం నెలకొంది. టీడీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు ఒడిగడుతున్నారంటూ వైఎస్సార్ సీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ ధ్వజమెత్తారు. ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే అజెండాలోని అంశాలను ప్రస్తావించారు. దాంతో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ జీరో అవర్‌ను ప్రవేశపెట్టి నగరంలోని ప్రజా సమస్యలను కౌన్సిల్‌లో చర్చించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో ఎంత ప్రాధేయపడినా ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ అజెండాలోని అంశాలను చదువుకుంటూపోతున్నారు. దీంతో ఆగ్రహించిన ఇమ్రాన్‌ఖాన్ ప్రజాసమస్యలపై కౌన్సిల్‌లో సభ్యులను మాట్లాడనీయకుండా గొంతు నొక్కేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. ఇమ్రాన్ ఖాన్‌తో వైఎస్సార్ సీపీ సభ్యుడు, 11వ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్ కుమార్, 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి, 41వ డివిజన్ కార్పొరేటర్ కత్తినేని మహాలక్ష్మమ్మ, కో ఆప్షన్ సభ్యురాలు ఎస్‌కే రషీదా కూడా గొంతు కలిపారు. దాంతో కౌన్సిల్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. షాదీఖానా లీజు అంశంపై, దశరాజుపల్లి రోడ్డులోని ఖబరస్థాన్‌కు ఇచ్చిన స్థలంపై వైఎస్సార్ సీపీ సభ్యులు మాట్లాడుతుంటే వారి వాదనలు వినకుండా కౌన్సిల్ నడుపుతున్నారని, సభ్యుల గొంతునొక్కేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బడ్జెట్‌లో పెట్టకుండానే కౌన్సిల్లో ఆమోదానికి...

ఒంగోలు నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం జరగకుండానే, బడ్జెట్‌లో ప్రవేశపెట్టకుండానే పలు అంశాలను సాధారణ సమావేశంలో ఆమోదానికి పెట్టడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న 681 మంది పారిశుధ్య కార్మికుల జీతభత్యాల విషయం, డ్వాక్రా గ్రూపుల ద్వారా సరఫరా చేస్తున్న చెత్త డంపింగ్ ట్రాక్టర్లకు ట్రిప్పునకు రూ.561 చొప్పున 20 ట్రాక్టర్లకు బాడుగలు చెల్లించేందుకు నిధుల మంజూరు, ప్రత్యేకంగా పారిశుధ్య పనులకు వినియోగించుకుంటున్న 150 మంది అదనపు పనివార్లకు జీతభత్యాలు మంజూరు చేసే అంశాలను ఈ సాధారణ సమావేశంలో అజెండాలో పెట్టారు. అసలు బడ్జెట్ సమావేశం జరగకుండా, అందులో ఆమోదం పొందకుండా ఏ విధంగా సాధారణ సమావేశంలో పెడతారని డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్ బాబు ప్రశ్నించారు. దాంతో వాటిని రద్దు చేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎక్స్ అఫీషియో మెంబర్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని, నగరంలో విద్యుత్ కాంతులు, నైట్ స్వీపర్స్ పర్యవేక్షణ, మంచినీటి సమస్య లేకుండా చేయడం, నగరంలో పచ్చదనాన్ని పెంపొందించటానికి, ఈ అంశాలను పర్యవేక్షించటానికి ఒక్కో విభాగానికి ఇద్దరేసి చొప్పున ప్రత్యేకంగా అధికారులను నియమించాలని సూచించారు. కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా మార్కెట్‌కు వెళ్తానన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ పేర్నమిట్టలో 198 ఎకరాల చెరువు ఉందని, భవిష్యత్తు మంచినీటి అవసరాల నిమిత్తం నగరానికి మూడో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా మలిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

చిరు వ్యాపారుల పొట్టకొట్టారు...

ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ కొత్త కూరగాయల మార్కెట్‌లో కూరగాయల వ్యాపారుల, చిరు వ్యాపారుల దుకాణాలను జనవరి 28న భారీ స్థాయిలో పోలీసులను తీసుకెళ్లి నగరపాలక సంస్థ అధికారులు ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. రోజు కూలీ రూ.500 నుంచి రూ.1000 సంపాదించుకునే చిరు వ్యాపారుల పొట్టకొట్టారని మండిపడ్డారు. చిరువ్యాపారులు దాదాపు 150 నుంచి 200 కుటుంబాలు వీధినపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో అద్దె బకాయిలు, దానిపై వడ్డీ పేరిట దుకాణాలు కూల్చడం ఎంతవరకు సమంజసమో అధికారులు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. 2010 మార్చి 31న మున్సిపల్ కౌన్సిల్ రిజెల్యూషన్ నంబర్ 832 ద్వారా చిరు వ్యాపారుల అద్దెను హోల్‌సేల్ షాపునకు రూ.5 వేల నుంచి రూ.2 వేలకు తగ్గించారన్నారు. అదే విధంగా రిటైల్ షాపునకు రూ.3 వేల నుంచి రూ.1000కి తగ్గించినట్లు ఆధారాలతో సహా చూపించారు. పెంచిన అద్దెలను తగ్గించి, ఆ అద్దెలపై వడ్డీలను కూడా తగ్గించి కూరగాయల మార్కెట్ వ్యాపారులకు న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ తరఫున డిమాండ్ చేశారు.

పోడియంను ముట్టడించిన వైఎస్సార్ సీపీ సభ్యులు...

కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీ సభ్యులు ప్రజా సమస్యలపై మాట్లాడాలని, జీరో అవర్‌లో చర్చించాలని డిమాండ్ చేసినా మాట్లాడనీయకుండా నోరునొక్కేస్తుండటంతో మేయర్ పోడియంను వారు ముట్టడించారు. ప్రజా సమస్యలను కౌన్సిల్‌లో ఎందుకు ప్రస్తావించటం లేదని మేయర్ వేమూరి సూర్యనారాయణను నిలదీశారు. అధికార టీడీపీ ప్రజా సమస్యలు పట్టించుకోకుండా పోవడాన్ని, కూరగాయల మార్కెట్ వ్యాపారులపై కక్ష సాధింపు చర్యలకు నిరసనగా కౌన్సిల్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి వైఎస్సార్ సీపీ సభ్యులు బయటకు వెళ్లిపోయారు. అనంతరం కౌన్సిల్‌లో షాదీఖానా లీజు అంశాన్ని, దశరాజుపల్లె రోడ్డులో ముస్లింల ఖబరస్థాన్‌కు ఇచ్చిన స్థలం రద్దు అంశాన్ని కూడా వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు.

జాతీయ జంప్‌రోప్ పోటీల్లో పామూరు విద్యార్థుల ప్రతిభ



జంప్‌రోప్, ఇతర పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ, చైర్మన్

పామూరు: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 11వ తేదీ జరిగే జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు పామూరు జీహెచ్‌ఎస్ 8వ తరగతి విద్యార్థిని షేక్.మన్నాద్ ఎంపికైనట్లు హెచ్‌ఎం యం.రామస్వామి, పీడీ షేక్.మస్తానీ తెలిపారు. ఈనెల 4వ తేదీ వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జంప్ రోప్ 3 నిమిషాల కాలపరిమితి విభాగం పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన 8వ తరగతి విద్యార్థిని షేక్.మన్నాద్‌తో పాటు, పలు విభాగాల్లో పాల్గొని సత్తాచాటిన విద్యార్థులను అభినందించారు. 30 సెకన్ల పోటీలో 8వ తరగతి విద్యార్థిని మనీషా సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. అదేవిధంగా 30–4 రిలేల్లో 8వ తరగతి విద్యార్థినులు కళాంజలి, దీపిక, యోగిత, ప్రియమణి తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించిందని చెప్పారు. అపర్ణ, బాలకుమారి ఫ్రీ స్టైల్‌లో రెండో స్థానం సాధించగా, బాలుర విభాగంలో 6వ తరగతికి చెందిన విద్యార్థులు బాలాదిత్య, రామ్‌చరణ్‌లు 30 సెకన్ల విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పీడీ మస్తానీని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, ఉపాధ్యాయులు భోగేశ్వరరావు, ప్రభాకర్‌రావు, మోహన్‌రావు, సుధాకర్‌రావు, వేణుగోపాలరావు, ఉత్తర్‌రావు, కళ్యాణి, రామ శివమ్మ, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత



వాటర్‌షెడ్ పథకాల ప్రతిమను ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

- వాటర్ షెడ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్
- పంచాయతీలను సమగ్ర అభివృద్ధి చేసుకోవాలన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పీసీపల్లి: నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వాటర్ షెడ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న వాటర్ షెడ్ అవగాహన యాత్ర ప్రారంభ కార్యక్రమం మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాటర్ షెడ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్ మాట్లాడుతూ రాబోయే తరాల వారికి సురక్షిత మంచినీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మొక్కలు నాటి, ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి నీటిని ఇంకించే పద్ధతిని అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో నాలుగు డబ్ల్యూసీసీ, 8 వాటర్ షెడ్ ప్రాజెక్టుల ద్వారా పనులు జరుగుతున్నాయన్నారు. పొలాల్లో ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, పొలాల చుట్టూ బౌండ్రీ ట్రెన్సెస్, కందకాలను తీసుకొని నీటిని ఇంకించుకుంటే భావితరాలకు ఉపయోగపడుతుందన్నారు. మురుగమ్మి గ్రామపంచాయతీ పరిధిలో 49 పనులకు గాను రూ.93 లక్షలు అమృత సరోవర్ కింద ఇప్పటికే ఖర్చుపెట్టి పనులు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం రూపొందించిన విజన్ డాక్యుమెంట్లలో కూడా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని జిల్లావ్యాప్తంగా నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం నేరేడుపల్లి, జంగాలపల్లి గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన యాత్రకు జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. నీటి సంరక్షణపై విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలైన వారికి ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, స్పెషల్ విజిలెన్స్ ఆఫీసర్ భవాని హర్ష, వాటర్ షెడ్ డిప్యూటీ కమిషనర్ సాగర్ కుమార్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్ కుమార్, వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ వండర్ మ్యాన్, ఏపీడీ చంద్రశేఖర్ రెడ్డి, మర్రిపూడి డబ్ల్యూసీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజేష్ కుమార్, తహసీల్దార్ ఉషా, సర్పంచ్ నల్ల గంగుల సుబ్బరత్నమ్మ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెవెన్యూ సదస్సుల అర్జీలు పరిష్కరించండి

● జేసీ గోపాలకృష్ణ


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ గోపాలకృష్ణ

మార్కాపురం: రెవెన్యూ సదస్సుల్లో, ప్రతి సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మార్కాపురం డివిజన్‌లోని పుల్లలచెరువు, బేస్తవారపేట, పెద్దదోర్నాల మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులతో అర్జీలపై సమీక్ష నిర్వహించారు. సదస్సులో వచ్చిన అర్జీలను శాఖలవారీగా కేటాయించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భూముల రీసర్వేల్లో తప్పులు జరగకుండా చూడాలన్నారు. సమీక్షలో సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆయా మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.


చెట్టును ఢీకొట్టిన కారు

● ఇద్దరికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: జాతీయ రహదారిపై వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం మద్దిపాడు మండలం వెంకటరాజుపాలెం సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన బి.కొండలరావు, బాలాజీ తమ వ్యక్తిగత పనిపై కారులో గూడూరు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి విజయవాడకు బయలుదేరారు. మార్గమధ్యంలో వెంకటరాజుపాలెం సమీపంలో వీరి కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. కారు ముందు సీట్లో కూర్చున్న బాలాజీకి నుదుటిపై, కొండలరావుకు తలపై తీవ్ర గాయాలయ్యాయి. వారి వెనుక వస్తున్న వర్కర్లు ప్రమాదాన్ని గమనించి క్షతగాత్రులిద్దరినీ మద్దిపాడు పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు.

రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం

● రూ.4.75 లక్షల ఆస్తి నష్టం


కాలిపోతున్న పొగాకు బ్యారన్

కొండపి: రెండు పొగాకు బ్యారన్లు ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన బుధవారం కొండపి మండలంలోని చోడవరం గ్రామంలో చోటుచేసుకుంది. అగ్నిమాపక అధికారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బి.అరుణ, బి.ఆంజనేయులు, బి.శ్రీవాణికి చెందిన రెండు బ్యారన్లలో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అల్లిక కర్ర జారి మొద్దు గొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే బ్యారన్లలోని టైర్లు, క్యూరింగ్‌లో ఉన్న ఆకు, కర్ర మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.4.75 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వరిగడ్డి వామి దగ్ధం

● రైతుకు 50 వేలు నష్టం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మార్కాపురం: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో ప్రమాదవశాత్తు వరిగడ్డి వామి దగ్ధమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన షేక్ గోకర్‌వలి తన పాడి పశువుల కోసం ఇటీవల కొనుగోలు చేసిన గడ్డికి అనూహ్య రీతిలో నిప్పంటుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి రామకృష్ణ తన సిబ్బందితో కలిసి వెళ్లి మంటలు అదుపుచేశారు. వరిగడ్డి కాలిపోవడంతో రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

పొదిలి రూరల్: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన పొదిలి మండలంలోని కంభాలపాడులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బసిరెడ్డి సుబ్బరత్తమ్మ ఓబులక్కపల్లె వెళ్లే మార్గంలో ఉన్న తమ పొలంలో బొబ్బర్లు కొయించేందుకు వెళ్లింది. మోటారు దగ్గర ఉన్న విద్యుత్ తీగను గమనించక అడుగు పెట్టడంతో షాక్‌కు గురైంది. స్థానికులు స్పందించి హుటాహుటిన ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

కార్యకర్తలకు అండగా..
జగనన్నకు తోడుగా..

● వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున


నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: 'కార్యకర్తలే పార్టీకి బలం.. వారికి అండగా నిలుద్దాం. జగనన్నకు తోడుగా ఉందాం' అని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. బుధవారం ఆయన మద్దిపాడులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసిన వారందరికీ పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి నెల నుంచి నియోజకవర్గాల వారీగా పర్యటనలకు సమాయత్తమవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంతనూతలపాడు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

పాలనలో చంద్రబాబు విఫలం

నేరుగా ఎన్నికల్లో గెలవలేని కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా దొడ్డి దారిన తమ వారిని కూర్చోబెట్టుకోవడానికి విశ్వప్రయత్నాలు చేసిందని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో చేసిన అప్పులకు మూడింతలుగా చంద్రబాబు ఈ ఆరేడు నెలల వ్యవధిలోనే చేశారని ఎండగట్టారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించడంలో చంద్రబాబు విఫలమయ్యారని, ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. చంద్రబాబు మాటలు చెబుతారుగానీ అమలు చేయరని, కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిన క్రమంలో జగనన్న లేని లోటు ప్రజలకు అర్థమవుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళాఖాతంలో విసిరేయడం ఖాయమన్నారు. వారంలో మూడు రోజులపాటు గ్రామాల్లో పర్యటిస్తానని, నాయకులందరూ సహకరించాలని కోరారు. అనంతరం పార్టీ పదవులు పొందిన వారందరినీ సన్మానించారు.

సమావేశంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, దుంపా చెంచిరెడ్డి, శ్రీమన్నారాయణ, చీమకుర్తి టౌన్ పార్టీ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఇనగంటి పిచ్చిరెడ్డి, నల్లమలపు కృష్ణారెడ్డి, పోలినేని కోటేశ్వరరావు, దుంపా యల్లమందరెడ్డి, మోరబోయిన సంజీవరావు, వాకా కోటిరెడ్డి, కంచర్ల సుధాకర్, అబ్బూరి శంకర్రావు, ఓబుల్ రెడ్డి, బెజవాడ రాము, బొడ్డపాటి హరిబాబు,మహిళా నాయకులు నారా విజయలక్ష్మి, మన్నం సంధ్య, కాకర్లపూడి రజిని, భారతి, జయమ్మ, సర్పంచ్ మల్లీశ్వరి బొమ్మల రామాంజనేయులు, కొమ్మూరి సుధాకర్, ప్రసన్నకుమార్, కో ఆప్షన్ మెంబర్ మూసా, బొమ్మల దేవదాసు, విల్సన్, మండల బాలచంద్రమౌళి, వెంకటాద్రి, నాదెండ్ల మహేష్, దుడ్డు వినోద్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంజెక్షన్ వికటించి గర్భిణి మృతి


మీనిగె అల్లూరమ్మ మృతదేహం(ఇన్‌సెట్‌లో) ఆమెకు చేసిన ఇంజక్షన్

అర్థవీడు: ఇంజెక్షన్ వికటించడంతో ఎనిమిది నెలల గర్భిణి మృతి చెందిన సంఘటన అర్థవీడులో బుధవారం చోటుచేసుకుంది. అర్థవీడు మండలం పాపినేనిపల్లెకు చెందిన ఎనిమిది నెలల గర్భిణి మీనిగె అల్లూరమ్మ(43) అర్థవీడు పీహెచ్‌సీలో వైద్యపరీక్షలకు వెళ్లింది. రక్తం తక్కువగా ఉండటంతో వైద్యుడు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ సెలైన్ ద్వారా ఎక్కించారు. కొంత సమయానికి ఊపిరి ఆడకపోవడం, చెమట పడుతుండటంతో డాక్టర్ కంభం వైద్యశాలకు రెఫర్ చేశారు. మెరుగైన వైద్యం కోసం కంభం వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో మృత్యువాతపడింది. దీనిపై సమాచారం అందుకున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి వైద్యశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఆ మహిళకు మొదటి రెండు సార్లు గర్భస్రావమైందని, మూడో కాన్పు తరువాత, మళ్లీ నాలుగోసారి గర్భం దాల్చిందన్నారు. వయసు ఎక్కువగా ఉండటంతో పాటు, గర్భిణి తీవ్ర రక్తహీనతతో ఆస్పత్రికి వచ్చిందని, దానికి వైద్యుడు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ సెలైన్ ద్వారా ఎక్కించారన్నారు. అయితే తరువాత ఆమెకు రియాక్షన్ రావడంతో మెరుగైన వైద్యం కోసం కంభానికి పంపగా మార్గం మధ్యలో మృతిచెందిందన్నారు. పూర్తిగా ఇంజక్షన్ వికటించడం వల్లే మృతిచెందిందని చెప్పలేమని అన్నారు. మృతురాలికి భర్త కాశయ్య, ఆరేళ్ల బాలిక ఉన్నారు.

45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


సీజ్ చేసిన బియ్యంతో అధికారులు

త్రిపురాంతకం: మండలంలోని వెల్లంపల్లి సమీపంలో జాతీయ రహదారిపై 90 బస్తాలలో అక్రమంగా తరలిస్తున్న 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా బియ్యం పట్టుబడ్డాయని తెలిపారు. త్రిపురాంతకానికి చెందిన ఇమ్మడిశెట్టి ప్రసాద్, గాయం తిరుపతిరెడ్డి, దర్శికి చెందిన ప్రకాష్ రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా తరలిస్తున్నట్లు వాహన డ్రైవర్ ఎర్రగుంట్ల చిన్నరాయుడు వాంగ్మూలం ఇచ్చాడని చెప్పారు. తనిఖీలో విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వరరావు, ఈడీటీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్


మార్కెట్‌లోకి వచ్చిన సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక ఆటోనగర్ సరిపూడి సుజుకి బ్రాంచిలో బుధవారం సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. సరిపూడి సుజుకి సంస్థ అధినేత సరిపూడి అనిల్‌కుమార్, ఎస్‌ఎంఐపీఎల్ ఆర్‌ఎం శివరామకృష్ణ, ఏఆర్‌ఎం బాలకృష్ణ, సీఈఓ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టూ వీలర్ విక్రయ రంగంలో సుజుకికి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. సుజుకి ఎస్సెస్ 125 సీసీ స్కూటర్‌ను ప్రారంభించడం అభినందనీయమని చెప్పారు. అన్నివర్గాలతోపాటు యువతకు ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. సంస్థ అధినేత సరిపూడి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ స్కూటర్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైందని, డ్రైవింగ్‌కు సులువైందని చెప్పారు. పదేళ్ల వారెంటీతో ఖాతాదారులకు స్కూటర్ అందిస్తున్నామని తెలిపారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలం
ఉపాధి హామీ నిర్వీర్యం

- వ్యవసాయ, కార్మిక రంగాలను కాలరాసేలా బడ్జెట్
- రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకుల ధ్వజం
- కలెక్టరేట్ వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం


బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని తూట్లు పొడిచేలా, కార్మిక హక్కులను కాలరాసి మరింత బానిసలుగా మార్చేలా ఉందని, అన్ని వర్గాల ప్రజలకు ఇది వ్యతిరేక బడ్జెట్ అని రైతు,, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ముందుగా కలెక్టరేట్ ఎదుట అంబేడ్కర్ విగ్రహం నుంచి చర్చి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలను ఎండగట్టారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మాత్రమే అనుకూలంగా ఉందన్నారు. 70 శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా, ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేలా బడ్జెట్ రూపొందించారని ధ్వజమెత్తారు. పీడీఎస్‌యూ నేత రాజశేఖర్ మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగాన్ని మరింత పెంచేలా బడ్జెట్ ఉందన్నారు. ఏడాదికి కోటి ఉద్యోగాల హామీ ఎక్కడని ప్రశ్నించారు. బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడులకు అవకాశమివ్వడాన్ని తప్పుబట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్పన మాట్లాడుతూ.. బడ్జెట్లో స్కీం వర్కర్లు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులకు ఎటువంటి కేటాయింపులు లేకపోవడాన్ని ఆక్షేపించారు. లేబర్ కోడ్స్, పంటలకు గిట్టుబాటు ధర, జీఎస్టీ భారం, విశాఖ ఉక్కు, పోలవరం ప్రాజెక్టు, రైతులకు రుణాల మంజూరులో కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ప్రజా సంఘాల నాయకులు ఎండగట్టారు. ఏపీ రైతు సంఘం నాయకులు కె.వీరారెడ్డి, పమిడి వెంకటరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఉప్పుటూరు ప్రకాష్‌రావు, కంకణాల రమాదేవి, ఎంఎస్ సాయి, చావలి సుధాకర్ రావు, ఆర్.మోహన్, జి.శ్రీనివాసరావు, భీమవరపు సుబ్బారావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు, జార్జి, ఆవుల సుబ్రహ్మణ్యం, పిన్నిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మేయర్‌కు వినతి పత్రం అందజేసేందుకు పోడియం వద్దకు వచ్చినవైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను బయటకు పొమ్మంటూ దౌర్జన్యం చేస్తున్న టీడీపీ కార్పొరేటర్ శ్రీనివాస్


సమస్యలు చెబుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, టీడీపీలోకి ఫిరాయించి నోటికొచ్చినట్లు దూషిస్తున్న కార్పొరేటర్ చెన్నుపాటి వేణు

అధికార మదంతో హేళన.. దూషణ

ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కార్పొరేటర్లు అధికార మదంతో చెలరేగిపోయారు. సాటి సభ్యులనే సంస్కారం లేకుండా విజ్ఞత మరిచి ప్రవర్తించారు. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను నోటికొచ్చినట్లు మాట్లాడటమే కాకుండా బయటకు వెళ్లమంటూ దౌర్జన్యం చేశారు. వైఎస్సార్ సీపీలో ఉండగా కౌన్సిల్ వైపు కన్నెత్తి చూడని చెన్నుపాటి వేణు టీడీపీలోకి ఫిరాయించాక ముందుగానే వచ్చి తిట్ల దండకం అందుకుంటున్న తీరు చర్చనీయాంశమైంది.

- సాక్షి, ఒంగోలు

పంచాయతీ కార్యాలయమా టీడీపీ ఆఫీసా?


దేవరపాలెంలో పంచాయతీ కార్యాలయానికి వేసిన పసుపు రంగు

చీమకుర్తి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ నాయకుల వికృత చేష్టలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. చీమకుర్తి మండలంలోని దేవరపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయానికి అధికార టీడీపీ పార్టీ నాయకులు పసుపు రంగు వేయించారు. గ్రామ పంచాయతీ కార్యాలయమా లేక టీడీపీ ఆఫీసా అనే రీతిలో భవనం ఉండటంతో చూసిన వారంతా ముక్కున వేలేసుకుంటున్నారు. పసుపు రంగు తొలగించాలని ఎంపీడీఓకు వినతిపత్రమిచ్చినా ఎలాంటి స్పందన లేదని గ్రామస్తులు ఆరోపించారు.

దారి దోపిడీ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

● నిందితులకు రూ.20 వేలు జరిమానా

కనిగిరి రూరల్: దారి దోపిడీ కేసులో ఇద్దరు నిందితులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.భరత్ చంద్ర బుధవారం తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. మర్రిపూడి మండలం గార్లపేటకు చెందిన వృద్ధుడు నామాల వెంకటస్వామి వాయిదాల పద్ధతిలో ఊరు ఊరు తిరిగి దుప్పట్లు అమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. దుప్పట్లు అమ్ముకోగా వచ్చిన నగదును అవసరాల నిమిత్తం కనిగిరి బ్యాంక్‌లో భద్రపరచుకున్నాడు. ఈ క్రమంలో వెంకటస్వామి, అతని భార్య 2022 సెప్టెంబర్ 3న కనిగిరి ఆంధ్రా బ్యాంక్‌లో రూ.3,50,000 నగదు డ్రా చేశారు. స్కూటర్ ముందు సంచిలో నగదు పెట్టుకుని సాయంత్రం వేళ స్వగ్రామానికి వెళ్తుండగా.. గార్లపేట రోడ్డులోని వెంకటేశ్వరస్వామి దేవాలయం దాటిన తర్వాత నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అటకాయించారు. మోటార్ సైకిల్‌పై వచ్చిన దుండగులు వృద్ధ దంపతుల కళ్లల్లో కారం కొట్టి వారిపై దాడి చేసి రూ.3.50 లక్షల నగదును తీసుకుని ఉడాయించారు. బాధితులైన వృద్ధులు తేరుకున్న తర్వాత కనిగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. హనుమంతునిపాడు మండలం సీతారామపురానికి చెందిన ఎస్‌కే సుభాని, ఎస్‌కే కరీముల్లాను నిందితులుగా గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. రెండేళ్ల విచారణ అనంతరం నిందితులపై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర జైలు శిక్ష, జరిమానా విధించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

● ఎస్పీ ఏఆర్ దామోదర్


త్రిపురాంతకేశ్వర ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న ఎస్పీ దామోదర్

త్రిపురాంతకం: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తద్వారా నేర నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసులకు సూచించారు. బుధవారం త్రిపురాంతకం పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులు, వృద్ధులపై జరిగే నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. మహిళలు చిన్నారులపై ఆకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. పోలీస్ ప్రతిష్టను పెంచేలా పనిచేయాలని చెప్పారు. ముందుగా త్రిపురాంతకేశ్వర ఆలయంలో ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ అసాన్, ఎస్సై శివబసవరాజు, కురిచేడు ఎస్సై శివ ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి


మృతుడు ఉంటా బాలయ్య

పామూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం వేకువజామున పామూరు సమీపంలోని 565 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పి.దాసు కథనం మేరకు.. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గుండమడుగుల గ్రామానికి చెందిన ఉంటా బాలయ్య(65) వరికుంటపాడులోని తమ కుమార్తె ఇంటికి వచ్చాడు. మానసిక స్థితి సరిలేని ఆయన అర్ధరాత్రి వరికుంటపాడులోని తన కుమార్తె ఇంటి నుంచి బయలుదేరి జాతీయ రహదారిపై నడుచుకుంటూ పామూరు వైపు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే మార్గంలో వెళ్తున్న వారు వేకువజామున 3.30 గంటల సమయంలో వృద్ధుడిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కనిగిరి వైద్యశాలలో మార్చురీకి తరలించిన పోలీసులు కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. భార్య లక్ష్మీనరసమ్మ, ఇతర కుటుంబ సభ్యులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు మృతి

● విషమంగానే భర్త పరిస్థితి


చికిత్స పొందుతూ మృతి చెందిన నారాయణమ్మ(ఫైల్)

దర్శి: కుమారుడి ఆదరణకు నోచుకోని వృద్ధ దంపతులు యాతం వెంకటేశ్వరరెడ్డి, నారాయణమ్మ సోమవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. నారాయణమ్మ(60)బుధవారం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తనువు చాలించింది. గత కొంత కాలంగా నారాయణమ్మ క్యాన్సర్ వ్యాధితో, వెంకటేశ్వరరెడ్డి నడుము నొప్పితో బాధపడుతున్నారు. అయితే కుమారుడు పట్టించుకోవడంలేదన్న ఆవేదనతో జీవితంపై విరక్తి చెందిన వృద్ధ దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నారాయణమ్మను మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కాగా ఆమె భర్త వెంకటేశ్వరరెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.